


# ...చేపాం చేపా! ఏడంలేదేం?

ఆదూరి
వెంకటసీతారామమూర్తి.

ఆ రోజు ఆఫీసులో అందర్నీ ఆశ్చర్యపరిచిన విషయం, ఆనందింపచేసిన విషయం ఒకటుంది అది. . . అమృతవల్లి అప్రంటిస్ క్లార్క్‌గా చేరటం.

"పిచ్చ బ్యూటీ గురూ" అన్నాడు గుర్నాథం, అప్పుడే వచ్చి తన సీట్లో కూర్చుంటూ.

"ఎవరూ? మొన్న ఇంటర్వ్యూలో చూశాం. పొడుగాటి జడ, ఎత్తు జోళ్ళు, దంత బొమ్మలా ఉంది. ఆ అమ్మడేనా?" అన్నాడు విష్ణుమూర్తి ఫైల్లోంచి తల పైకెత్తి కళ్ళద్దాల్లోంచి గుర్నాథం వంక చూస్తూ.

"కరెక్టుగా పట్టేశావ్ గురూ. అందానికి తగ్గట్లేనూ, చలాకీతనం. . ." అంటున్న గుర్నాథం మధ్యలోనే ఆగిపోయాడు.

అప్పుడే అమృతవల్లి లోపలికి అడుగు పెట్టింది ఆఫీసు సూపరెండెంటుగారితో సహా.

అంతా తలలు పైకెత్తి గుడ్లు విలేసేశారు.

నిజం చెప్పొద్దూ. అమృతవల్లి అందాల రాశి. ఒకసారి చూస్తే దృష్టి తిప్పలేం. తిప్పినా మళ్ళీ, మళ్ళీ చూడాలనిపిస్తుంది. అటువంటి అందం లోకంలో ఏ కొద్ది మంది సొత్తో.

"విష్ణుమూర్తిగారూ, ఈ అమ్మాయి మన

ఆఫీసులో అప్రెంటీస్‌గా చేరారు. వర్క్ చెప్పండి" అని, "చూడమ్మా, ఈ సెక్షన్‌లో అన్ని సీట్ల పనీ నేర్చుకో" అని వెళ్ళిపోయారు సూపరింటెండెంటు గారు.

"నీ పేరేమిటమ్మా' అన్నాడు విష్ణుమూర్తి. కళ్ళజోడు ఫ్రేమ్‌ను చూపుడు వేలితో ముక్కు పైకి లాగి.

"అమృతవల్లి."

విష్ణుమూర్తి ఇంకేం" ప్రశ్న వేస్తాడో అని మిగతా జనమంతా చెవు లొగ్గి పారేసి వాళ్ళ పనుల్లో వాళ్ళున్నట్లు నటిస్తున్నారు.

"ఆ కుర్చీ లాక్కుని కూర్చో తల్లీ" అన్నాడు విష్ణుమూర్తి.

విష్ణుమూర్తి చాలా చమత్కారంగా మాట్లాడతాడు. వయసు ముప్పయి అయిదేళ్ళే అయినా యాభై య్యేళ్ళ వాడిలా అతడు అమృతవల్లితో మాట్లాడుతూంటే వచ్చే నవ్వును ఆపుకుంటున్నారందరూ.

"చూడమ్మా. మీకు టోటలింగ్ చేయడం వచ్చుగా!"

విష్ణుమూర్తి మాటలకు అమృతవల్లి అదోలా చూసి,

"నేను బియ్యే పాసయ్యానండోయ్" అంది. నేను పాసయ్యాను. "ఏం లాభం. ఏం పాపం మీకు రాదా?"

అమృతవల్లి మాటలకు అంతా గొల్లుమని నవ్వారు. నేను మాత్రం బలవంతాన నవ్వాపుకుని పనిలో పడ్డాను.

నింపాదిగా తలెత్తి అందరి వంకా చూసి "సైలెన్స్" అంటూ గట్టిగా బల్ల గుద్దాడు విష్ణుమూర్తి.

అంతా గప్‌చుప్ అయ్యారు.

"చూడమ్మా అమృతవల్లీ. నేను డాక్టర్నవాలని మా నాన్న ఇంటర్లో సైన్సు గ్రూపు తీసుకోమని పోరు పెట్టాడు. అప్పటికే నాకు లెక్కల గండం గడిచిందిరా భగవంతుడా అనుకుని ఆయన మాటకి 'సై' అన్నాను. తీరా అది గండమై ఆత్తెసరు మార్కులతో పాసయ్యాను. పోనీ డాక్టర్ని కాకపోతే పోయింది. కనీసం ఇంగ్లీషు లెక్చరర్నైనా అవుదామని బియ్యే చదివాను. బియ్యేలో థర్డ్ క్లాసొచ్చి గుమాస్తా అయ్యాను. ఇక్కడ కొచ్చిన కొత్తల . . . ఇదిగో. . . నీ లాగే బియ్యే బియ్యే అని నీల్గేవాడిని. ఆ తరవాత టోటలింగు నేర్చుకుని టోటల్సు చేసి చేసీ. . . ఈ బడ్జెట్ సీట్లో అంకెల గారడీ చేసీచేసీ, ఇంగ్లీషు పూర్తిగా మరిచిపోయాను" అంటూ 'ఎలాక్కొట్టాను దెబ్బ' అన్నట్లు ఆమె ముఖంలోకి చూశాడు.

"మరి మీరు గురువులు. మీ దారిలోనే నేనూను" అంది అమృతవల్లి నవ్వుతూ.

"సరే చెయ్యండి" అంటూ ఒక స్టేట్‌మెంట్ ఇచ్చి టోటల్సు చూడమన్నాడు.

* * *

"ఏమండోయ్ అమృతవల్లిగారూ, మీరు మా యూనిట్ కొచ్చి రెండ్రోజులు అయింది. బాగానే ఉంది — మరి ఇక్కడ సంప్రదాయాలు కూడా మీరు ఫాలో అవ్వాలి" అన్నాడు గుర్నాథం.

అతని వంక ఆశ్చర్యంగా చూసి, "ఏమిటట అవి" అంది అమృతవల్లి.

"ప్రమోషనొస్తే డిన్నరూ, కొత్తగా జాయినయితే పార్టీ ఇక్కడ నియమం. మీరు అప్రెంటిస్ కాబట్టి అంత కాకపోయినా కార్డో గొప్పో శాంతి చేయించక తప్పదు."

"ఏం చేయాలో మీరే చెప్పండి" అంది అమృతవల్లి నవ్వుతూ.

"ఏముందీ — గొంతు తడిపేందుకు ఏమన్నా పోయించండి, చాలు" అన్నాడు గుర్నాథం.

"అంటే?" ఆశ్చర్యంగా చూసింది అమృతవల్లి.

ఈలోగా విష్ణుమూర్తి కల్పించుకున్నాడు.

"మరేం లేదు. మా వాడు ఫ్రీగా వస్తే ఫినైలేనా తాగేస్తాడు. దానికితోడు గొంతెప్పుడూ ఎండిపోయి గొంతెమ్మ కోరికలు కోరుతూనే ఉంటుంది."

"నేనేం విస్కీ కావాలన్నానా? బీరు కావాలన్నానా? కనీసం కాఫీ అడుగుతున్నా. అక్కడి కేదో ఆయన గారికి అక్కర్లేనట్టు" అన్నాడు గుర్నాథం చిన్నబుచ్చుకుని.

"ఓస్. అంతేనా? మీ కెప్పుడు కావాలో చెప్పండి. కాఫీ కాదు, టిఫినే తెప్పిస్తాను. కానీ నాకో సాయం చేసిపెట్టాలి."

"ఏంటో అది?"

"ఈ టోటలింగ్ గొడవ తప్పించాలి. ఈ పాతోంది అంకెలతో."

అమృతవల్లి మాటలకు ఘొల్లున నవ్వే రంతా, ఒక్క విష్ణుమూర్తీ, నేనూ తప్ప.

* * *

"పాపకి పని గండం లాగుంది."

కుర్చీలో వెనక్కు చేరగిలబడి అన్నాడు విష్ణుమూర్తి.

## అసలు విషయం

ప్రేమించడం
తెలివితక్కువ కాదు
తి-తెవి తక్కువగా ప్రేమించడమే
తిరస్కరింపబడడం
కష్టం కాదు
— కష్టమై తిరస్కరింపబడడమే
మరిచిపోవడం
గొప్పకాదు
-అదో 'గొప్ప'గా మరచిపోవడమే
రాసిందల్లా
కవిత్వం కాదు
— కవిత్వమై రాసిందే.

— సుధామ

"ఎవరికంటావూ?" అన్నాడు సీరియస్‌గా పన్జేసుకుంటున్న గుర్నాథం విష్ణుమూర్తి మాటలకు డిస్టర్బయి.

"ఇంకెవరు? మన ఎప్రెంటిస్."

"అవును మరి! గురువుగారి అడుగు జాడలూ, అలవాట్లూను. నీకూ అంతేగా—చిన్నప్పుడు చదువు గండం, పెద్దయ్యేక పని గండం."

గుర్నాథం మాటలకు గొల్లుమన్నా రంతా.

"ఎవ్వడమేనా! ఎవరేనా నాకు కాఫీ ఇప్పించడమంటారా? ఒరే రాజారావ్. నువ్వు రావమ్మా కాఫీ ఇప్పించు" అంటూ లేచాడు విష్ణుమూర్తి.

రాజారావు పెన్నుంచి లేవలేదు.

"నాన్నోనిగరే మీ శిష్యురాలు క్లాసువించి తిరిగొస్తుంది. ఈలోగా అనిడ కప్పగించిన టోటలన్నీ అవి నువ్వే చేసేస్తే టీ ఇప్పిస్తుంది" అన్నాడు తాపీగా.

విష్ణుమూర్తి ఇక ఆగలేదు. పరివారాన్ని పిలవనూ లేదు. సెక్షన్ క్లార్క్ గార్కి చెప్పలేదు, దార్లో ఎదురైన సెక్షన్ గారికి విష్ చెయ్యలేదు. గజేంద్రుడు సెలిస్తే శ్రీమహావిష్ణువు మాదిరి లేచి వెళ్ళి పోతున్నట్లు వెళ్ళిపోయాడు.

* * *

"ఏం గండం ఉద్దండ పిండమే!" అన్నాడు విష్ణుమూర్తి కేంటీన్ నుంచి వస్తూనే.

"ఏమైందేమిటి?" గుర్నాథం నోరూరుకోలేదు.

"ఇంతసేపటిమ మన ముందుండగా రిసెప్షన్‌లో కనకారావుతో కలిసి కాఫీ తాగుతోంది."

"నువ్వూ నేనూ పిల్లల తండ్రులం — కనకారావు కన్నె పురుషుడూను. తేడా లేదూ?" అన్నాడు గుర్నాథం.

"కన్నె పురుషు డేమిటోయ్. మధ్యలో."

"ఏముందీ... కన్నె పిల్లలకు కావల్సిన పురుషుడు, ఎర్రగా, బుర్రగా తెల్లజుట్టు లేకుండా ఉండే పెళ్ళి కాని పురుషుడు" వివరించాడు గుర్నాథం.

"ఇంతకీ పెళ్ళి వలేస్తోందంటావు. అంతేనా?"

"ఏమో మరి! ఈ మధ్య మన విష్ణుమూర్తిగారి దివ్య దృష్టికి అలాగే తోస్తోంది" అంటూ ఇటు నావైపు తిరిగి, "మన రచయితగారి కేమన్నా మేటర్ దొరుకుతుందేమో" అన్నాడు.

ఒక అడా, మగా కలిసి మాట్లాడుంటేనే విపరీతార్థాలు తీసే ఈ జనం ఎప్పుడు మారుతారో అర్థం కాలేదు నాకు.

"రచయిత అంటున్నా రెవరండోయ్" అంటూ రానే వచ్చింది అమృతవల్లి.

"ఇంకెవరూ! మన రమణమూర్తే."

"ఏమిటి? రమణమూర్తిగారు కథ రాస్తారా?" అంటూ ఆశ్చర్యపోయి, "ఏమండీ నిజమేనా" అంది నా దగ్గర కొచ్చి.

నేనేం మాట్లాడ లేదు. నవ్వి ఊరుకున్నాను.

"ఏ పేరుతో రాస్తుంటారండీ" అంటూ నా కెదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది.

కొంచెం ఇబ్బందనిపించినా చెప్పాను.

"అవునండోయ్. గుర్తు కొచ్చింది. 'పెన్నెట్లో పన్నీరు' అన్న మీ నవల చదివాను. చాలా నచ్చింది

నాకు. మిమ్మల్నిలా కలుసుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది" అంది.

పనిలో నిమగ్న మయ్యాను నేను.

• • •

"మీరేం అనుకోనంటే మీతో ఒక్క విషయం మాట్లాడాలి" అన్నాను ఒక రోజు లంచవర్లో అమృతవల్లితో. నేను రచయిత నని తెలిశాక ఈ మధ్య నాతో చనువుగా ఉంటూంది. ఆ చనువు నాధారం చేసుకునే ఆమె గురించి వినిపిస్తున్న పుకార్ల లోని నిజం తెలుసుకోవా లనిపించింది.

"అఫీషియలా పర్సనలా" అంది కళ్ళెత్తి.

"పర్సనలే."

"ఓ. యస్. గ్రహించాను. మీ మీద నాకు గౌరవ ముంది. అలాగే మాట్లాడండి. అయిదయ్యాక వస్తాను" అంది.

అన్నట్టుగానే ఆఫీసయ్యాక నా దగ్గరకు వచ్చింది.

ఫ్లాస్క్‌లో మిగిలిన కాఫీని రెండు కప్పుల్లోకి నర్సి ఆమె కొకటి అందిస్తూ అసలు విషయాన్ని కదిపాను.

"అవును—అందరూ అనుకుంటున్నది నిజమే" అంది ధైర్యంగా.

అమృతవల్లి సంగతి నాకు బాగా తెలుసు. అందుకే నే నాట్టే ఆశ్చర్యపోలేదు.


"మీ ధైర్యానికి సంతోషంగానే ఉంది. కానీ అత నెలాంటి వాడో తెలుసుకుంటే మీ రలా ఉండేవారు కాదేమోన నిపిస్తోంది. నా వూహలో మీ వయసు పంతొమ్మిది దాటి ఉండదు. జీవితాన్ని గురించిన అవగాహన ఇప్పుడిప్పుడే రూపం దిద్దుకుంటూ ఉండవచ్చు. ఈ వయసులో తెల్సిని వన్నీ పొరిచే భ్రమ కలగటం సహజం. బంధుత్వాన్ని కలుపుకుంటూ మీకు హితబోధ చేయడం నా కిష్టం లేదు. ఒక శ్రేయోభిలాషిగా మీ కీ సంగతి చెప్పాలనుకున్నాను. మీరు ఆలోచించగలరనే నమ్మకం నా కుంది."

వంచిన తలెత్తి నా కళ్ళల్లోకి ఒక్క సారి చూసి తల దించుకుంది.

"నా వయసును గురించీ, సాధారణంగా ఆ వయసులోని కోర్కెల గురించీ మీ రూహించింది నిజమే. కానీ మీ రనుకున్నంత అమాయకురాల్నేం కాదు నేను. నేను పెరిగిన పరిస్థితులు అటువంటివి. వింటానంటే నా గురించి కొంచెం చెబుతాను. ఆ తరువాత మీ అభిప్రాయం చెబితే ఆనందంగా అంగీకరిస్తాను."

నే నేం మాట్లాడలేదు.

"మీరు నా గురించి వూహించినట్లే నాలుగేళ్ళ క్రితం నా అక్క ఒకర్ని గుడ్డిగా నమ్మి మోస పోయింది. దాని పర్యవసానం ఇప్పటికీ అనుభవిస్తోంది. పరిస్థితుల్నీ, మనుష్యుల్నీ ఇప్పుడిప్పుడే అవగాహన చేసుకుంటున్న నేను నా దారిన ఎలా వెళ్ళాలో చెప్పండి? ఒక్కటే మాత్రం నిజం. పదిహేనంటే చెప్పేవాడు కాని వేలు వేలు కట్నాలు పోసి పెళ్ళిళ్ళు చేసే స్థితిలో లేదు మా నాన్న. బడిపంతులు ఉద్యోగం చేసి రిటైరయ్యా డాయన. వయసు అడిగిన విశ్రాంతి తీసుకోవాల్సి ఉన్నా, పరిస్థితులు వూపిరి సలప నీయటం




లేదు. నా చెల్లెలు ఇంకా పెళ్ళి కెదిగిన చెల్లెలా, కాలేజీ చదువుకు వస్తున్న తమ్ముడూ ఉన్నారు. నన్ను ప్రేమవేటట్లా, పెళ్ళిలా, నా ఈ స్థితే [illegible] కాదూ."

అమృతవల్లి చెప్పటం ఆపింది. నాకామె చెప్పిం దాంట్లో కొత్తేం కనిపించలేదు. ఈ రోజుల్లో నూటికి తొంభై మధ్య తరగతి కుటుంబాలు అలానే ఉన్నాయి. అయితే ఒక్కటి మాత్రం ఆశ్చర్యకరం గానే ఉంది. అట్లాంటి పరిస్థితుల్లోని అమ్మాయి అతి ఖరీదైన బట్టలు వేసుకుని అత్యంత నాగరికంగా తుళ్ళుతూ ఆనందంగా ఎలా ఉంటుందా ని. నా భావాల్ని పసిగట్టిందో ఏమో. . .అమృతవల్లి మళ్ళీ చెప్పటం మొదలు పెట్టింది.

"నన్ను చూస్తే నా పరిస్థితులిలా ఉన్నాయని ఎవరూ వూహించలేరు. మనిషిలోని ధైర్యం, తెగింపు ఒక్కొక్కప్పుడు పరిస్థితుల్ని చక్క బరుస్తాయని నా నమ్మకం. నాకీ అప్రెంటిస్ జాబ్ రావడానికి నా ధైర్యమే కారణమంటే మీరు నమ్మలేరు. మీకు తెలియందేముంది? చీకటిని తిట్టుకుంటూ కూర్చునే కంటే లేచి ధైర్యంగా అగ్గిపుల్ల వెలిగించుకుంటేనే మంచిది. పరిస్థితులిలా ఉన్నాయని మనమూ అంతకంటే దిగజారి ఉండ డం నాకిష్టం లేదు.—మనసు పరిణత చెందిన ఆడైనా మగైనా తన భవిష్యత్తు తానే దిద్దుకోవాలంటాను నేను ఈ వేషం, భాష అందుకు చాలా అవసరం ఈ రోజుల్లో."

వాల్‌క్లాక్ గంట కొట్టింది—అయిదున్నర!

"నడుస్తూ మాట్లాడుకుందాం రండి" అంటూ లేచాను.

అమృతవల్లి మౌనంగానే నన్ను అనుసరించింది.

అడుగులు వేస్తున్నా ఆమెను ప్రశ్నలు మాత్రం వేయటానికి సాహసించలేదు నేను.

"ఈ రోజుల్లో ఎవరికి తోచింది వారూహించో, ఏవో రూమర్లు వ్యాప్తి చేసేవారేగాని నువ్వు నడుస్తున్న మార్గం మంచిది కాదు సుమా' అని చెప్పేవారు లేరు. మనది సభ్య సమాజం మరి! మీరు నా గురించి శ్రద్ధ తీసుకున్నారు. నే నేమనుకున్నా నా నడవడికను గురించి హెచ్చరించా లనుకున్నారు అందుకే మీ మీద నాకున్న గౌరవం ఒక్కసారి రెట్టింపు అయింది. ఒక్కటి మాత్రం నిజం రమణమూర్తి గారూ! నేను తప్పటడుగులు వెయ్యొచ్చు. . . కానీ కాలు జారి పడిపోను!"

బస్సు వస్తే వెళ్ళి పోయింది అమృతవల్లి— మళ్ళీ తర్వాత ఆమె స్వవిషయం గురించి కల్పించుకు మాట్లాడలేదు నేను—

ఆమె సెక్షన్ మారి వెళ్ళిన రెండు నెలలకను కుంటా కనకారావు పెళ్ళి నిశ్చయమైంది - అమృతవల్లితో మాత్రం కాదు. మం కీసవల్లితో. సాధారణంగా కథలకు చివరిమలుపు ఒకటే ఉంటుంది. జీవితానికి మాత్రం మలుపులెన్నో!! మరో నాలుగు నెలలకు అమృతవల్లిని గురించి మరో పుకారు నా చెవిన పడింది. కొత్తగా చేరిన కుర్ర ఇంజనీరుతో ఆమె ఏదో హోటల్లో పట్టుబడ్డట్టు పుకారు కలరాకన్నా ప్రమాదకరమైంది. అందుకే నేనిక ఆలోచించలేదు!

అప్రెంటిస్ షిప్ ఏడాది అయిపోయిందని చెప్ప టానికి వచ్చింది అమృతవల్లి. 'ఫర్వాలేదు ఆలస్యమైనా మీ బాచ్‌కి జాబ్స్ రావచ్చు' అని ధైర్యం చెప్పాను.

అప్పుడు చెప్పింది అమృతవల్లి తనకు ఇంజనీర్ సీతాపతితో పెళ్ళి నిర్ణయమైనట్లు. తాంబూలాలు కూడా పుచ్చుకున్నారట పెళ్ళికి తప్పక రమ్మంది నిజంగా చాలా సంతోషమనిపించింది నాకు.

"చీకటిని తిట్టుకుంటూ కూర్చునే కంటే లేచి ధైర్యంగా అగ్గిపుల్లను వెలిగించుకుంటేనే మంచిది."

"పరిస్థితులిలా ఉన్నాయని మనమూ అంతకంటే దిగజారి ఉండకూడదు."

"మనసు పరిణత చెందిన ఆడైనా మగైనా తన భవిష్యత్తును తానే దిద్దుకోవాలి. ఈ వేషం, భాష అందుకు చాలా అవసరమీ రోజుల్లో."

"నువ్వు నడుస్తున్న మార్గం మంచిది కాదు సుమా" అని చెప్పేవారు లేరీ సమాజంలో.

తప్పటడుగులు వేసినా కాలు జారి పోకూడదు.

. . .ఎప్పటివో!. . ఆనాటి అమృతవల్లి మాటలు, భావాలు నాకిప్పటికీ గుర్తున్నాయి. జీవితాన్ని శోధించి అందులోంచి వెలికితీసిన నిజాలవి!

*